సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 11 । ఏప్రిల్ । 2024



సోమశిలలో 8.884 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారం సాయంత్రానికి 8.884 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయం నుంచి దిగువకు 390 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.74,280
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,635
3శాతం జీఎస్టీతో	రూ.6,834
నవర (8గ్రాములు)	రూ.54,672



నిబంధనలను పాటించాలి

ఎన్నికల నేపథ్యంలో నిబంధనలను విధిగా పాటించాలని ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ పేర్కొన్నారు. జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. IIలో

న్యూస్‌రీల్

టీడీపీ ప్రచారంలో సచివాలయ ఉద్యోగి



టీడీపీ కండువాతో సురేష్

కావలి: టీడీపీకి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగిపై కావలి నియోజకవర్గ ఎన్నికల అధికారి శీనానాయక్‌కు ఫిర్యాదులు అందాయి. దగదర్తి ఎస్సీ కాలనీకి చెందిన మెత్తళ్ల సురేష్ రాపూరు మండలంలోని సిద్ధవరం గ్రామ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. విధులకు డుమ్మా కొట్టి తన స్వగ్రామం దగదర్తిలో టీడీపీకి మద్దతుగా, ఆ పార్టీ కండువా వేసుకొని ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఈయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్డీఓ, కలెక్టర్‌కు కొందరు ఫిర్యాదు చేశారు.

రూ.16.9 లక్షల స్వాధీనం

- 298 మద్యం బాటిళ్ల సీజ్



నవాబుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో కేంద్ర బలగాలు, పోలీస్ అధికారుల కవాతు

నెల్లూరు(క్రైమ్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా నగదు, మద్యం అక్రమ రవాణా, నిల్వలు తదితరాలపై పోలీస్ అధికారులు తనిఖీలు కొనసాగిస్తున్నారు. నవాబుపేట పరిధిలో రూ.3.5 లక్షలు, కోవూరు పరిధిలో రూ.8 లక్షలు, మనుబోలు పరిధిలో రూ.లక్ష, వెంకటాచలం పరిధిలో రూ.3.3 లక్షలు, కావలి రూరల్ పరిధిలో రూ.1,10,180 నగదును ఎలాంటి రసీదుల్లేకుండా అక్రమంగా తరలిస్తుండగా మంగళ, బుధవారాల్లో పోలీస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మద్యం అక్రమ రవాణాపై దాడులను ముమ్మరం చేశారు. ఇందుకూరుపేట పరిధిలో 16, కోవూరు, వెంకటాచలం, ముత్తుకూరులో 12 చొప్పున, వింజమూరులో 11, మనుబోలు, వలేటివారిపాళెం, నవాబుపేటలో 15 చొప్పున, పొదలకూరు, కలిగిరిలో పది చొప్పున, రాపూరు, సీతారామపురంలో 13 చొప్పున, కందుకూరులో 20, సైదాపురంలో ఏడు మద్యం బాటిళ్లను పోలీస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లావ్యాప్తంగా అక్రమంగా తరలిస్తున్న 117 మద్యం బాటిళ్లు.. మొత్తంగా 298 బాటిళ్లను ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకొని నిందితులపై కేసులు నమోదు చేశారు.

కేంద్ర బలగాలతో కవాతు

సార్వత్రిక ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహిస్తామనే భరోసాను ప్రజల్లో కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు కేంద్ర బలగాలతో కలిసి కవాతును నిర్వహిస్తున్నారు. నవాబుపేట, కందుకూరు, మర్రిపాడు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ప్రాంతాల్లో స్థానిక పోలీస్ అధికారులు, బీఎస్ఎఫ్ బలగాలు కవాతును నిర్వహించారు.

ఎన్నికల పరిశీలకుల నియామకం

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని వివిధ నియోజకవర్గాలకు పరిశీలకులను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.

- నెల్లూరు సిటీ, రూరల్, కోవూరు, ఆత్మకూరు నియోజకవర్గాలకు సాధారణ పరిశీలకుడిగా నితిన్‌సింగ్ బదౌరియాను నియమించారు.
- కందుకూరు, కావలి, ఉదయగిరి నియోజకవర్గాలకు రామ్‌కుమార్‌గౌతమ్, సర్వేపల్లి నియజకవర్గ సాధారణ పరిశీలకుడిగా కరీగౌడ నియమితులయ్యారు.
- పోలీస్ పరిశీలకులుగా అశోక్ దూబే, అరవింద్ సాల్వేను నియమించారు. పోలీస్ పరిశీలకులు ఏప్రిల్ 25 నుంచి మే 13 వరకు.. సాధారణ పరిశీలకులు ఏప్రిల్ 25 నుండి జూన్ నాలుగు వరకు జిల్లాలో విధుల్లో ఉంటారు.

హిస్టరీ విద్యార్థుల క్షేత్ర సందర్శన



విడవలూరు : స్థానిక పీఆర్ఆర్ – వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిస్టరీ గ్రూప్ విద్యార్థులు మండల పరిధిలో బుధవారం క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని హిస్టరీ లెక్చరర్ మగ్గం వెంకటరమణరావు మాట్లాడారు. వివిధ ప్రాంతాల్లోని పంటలు, సాగునీటి వినియోగం, మత్స్య సంపద వృద్ధి, రైతుల స్థితిగతులను విద్యార్థులు పరిశీలించారని చెప్పారు. చెరువు కరకట్టపై ఉండే వివిధ వృక్ష సంపద, పక్షుల ఆగమనం తదితరాలను తెలుసుకున్నారని తెలిపారు.

నిన్ను నమ్మం బాబూ

అధికారమే పరమావధిగా ఆచరణ సాధ్యం కాని హామీలను గుప్పించడం.. ఆపై విస్మరించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. ఇదే ఫార్ములాను అనుసరించి 2014 ఎన్నికల్లో గద్దెనెక్కిన ఆయన తన నిజస్వరూపాన్ని చూపారు. ఆ సమయంలో ఆయన అనుసరించిన మోసపూరిత వైఖరితో పొదుపు సంఘాల సభ్యులు.. రైతులు.. యువత.. ఇలా ఎంతో మంది వంచనకు గురయ్యారు. 2019 ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో 99 శాతం మేర సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని పొందారు. ఈ తరుణంలో తన పాత పంథాను అమల్లోకి తెచ్చి 'సూపర్ సిక్స్' పేరుతో దగా చేసేందుకు సిద్ధమైన చంద్రబాబు రాజకీయాలను ప్రజలు విశ్వసించడంలేదు.

హామీలివ్వడం.. ఆపై విస్మరించడంలో దిట్ట

- 2014 ఎన్నికల్లో అన్ని వర్గాలను వంచించిన వైనం
- అప్పుల ఊబిలో రైతన్నలు, పొదుపు సంఘాలు చిత్తు
- తాజాగా 'సూపర్ సిక్స్' పేరుతో మరోసారి మోసానికి సై
- పట్టించుకోని జిల్లా ప్రజానీకం



ఉదయగిరి: అధికారాన్ని చేజిక్కించుకోవడమే లక్ష్యమనే రీతిలో 2014 ఎన్నికల సమయంలో బూటకపు హామీలకు చంద్రబాబు శ్రీకారం చుట్టారు. ఆయన మాటలను విశ్వసించిన ఎంతో మంది దిక్కుతోచని స్థితిలో అప్పుల ఊబిలో కూరుకుపోయారు. తాజాగా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కొత్త జిమ్మిక్కులను ఆయన తెరపైకి తీసుకొచ్చారు.

మీ హామీలు మాకొద్దు..!

2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99 శాతం మేర అమలు చేసి ప్రజాభిమానాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చూరగొన్నారు. మీ ఇంట్లో మంచి జరిగితేనే తనకు ఓటేయండి అంటూ ఎన్నికల ప్రచారానికి ఆయన శ్రీకారం చుట్టారు. దీంతో దిక్కుతోచని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయి. ఎన్నికల సభల్లో చంద్రబాబు ఇస్తున్న హామీలను ప్రజలు విశ్వసించడంలేదు. ప్రజాగళం పేరుతో కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లో చంద్రబాబు నిర్వహించిన సభలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయి.

వంచనకు గురైన రైతులు

రైతులకు రుణమాఫీ చేస్తా.. బ్యాంకుల్లో బంగారాన్ని తాకట్టు పెట్టి తీసుకున్న రుణానికి ఒక్కపైసా కట్టొద్దు.. అధికారంలోకి వచ్చిన వెంటనే అంతా నేనే చెల్లిస్తానంటూ ఆ రోజుల్లో చంద్రబాబు ఇచ్చిన హామీ పచ్చి బూటకం. రైతు రుణమాఫీ పత్రాలను ఇచ్చినా.. బ్యాంకులకు వాయిదాలు చెల్లించకపోవడంతో 2019 నాటికి వారు డీఫాల్టర్లుగా మారారు. దీంతో రైతులకు నోటీసులొచ్చాయి. బ్యాంకర్ల వద్ద తలెత్తుకోలేక.. ఆస్తులు అమ్మి అప్పులను చక్రవడ్డీతో సహా చెల్లించి ఆర్థికంగా చితికిపోయారు. ఇలా జిల్లాలో 12 లక్షల మంది రైతులు బాబును నమ్మి మోసపోయారు.

ఉద్యోగాల పేరుతో మోసపోయిన యువత

జాబు రావాలంటే బాబు రావాలంటూ యువతను చంద్రబాబు ఊదరగొట్టారు. తీరా ఇంటికో ఉద్యోగం మాట అటుంచితే కనీసం ఊరికో ఉద్యోగాన్ని సైతం ఇవ్వలేకపోయారు. కాపు రిజర్వేషన్లను సైతం విస్మరించారు. ముస్లింలు, క్రైస్తవులకు ఇచ్చిన హామీలనూ తుంగలో తొక్కారు. చివరికి టీడీపీ వెబ్‌సైట్ నుంచి ఎన్నికల మేనిఫెస్టోను మాయం చేశారు.

డ్వాక్రా మహిళలకు కోలుకోలేని దెబ్బ



డ్వాక్రా మహిళలకు చంద్రబాబు హయాంలో కోలుకోలేని దెబ్బ తగిలింది. 2014 ఎన్నికల సమయంలో పొదుపు రుణాలను మాఫీ చేస్తామని ఆయన ప్రకటించడంతో వారిలో ఆశలు చిగురించాయి. ఓట్లేసి గెలిపించాక ఆ హామీని చంద్రబాబు విస్మరించడంతో అప్పులు పేరుకుపోయి పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకుల నుంచి నోటీసులొచ్చాయి. ఏ గ్రేడ్‌లో ఉన్న సంఘాలు.. డీ గ్రేడ్‌కు పతనమయ్యాయి.

సూపర్ సిక్స్ పేరుతో సరికొత్త నాటకం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై చంద్రబాబు విమర్శలు గుప్పించేవారు. తీరా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అవే పథకాలకు పేర్లు మార్చి.. మీరొకటి అంటే నేను రెండు అనే రీతిలో సూపర్ సిక్స్ పేరుతో హామీలకు తెరలేపారు. వీటిపై టీడీపీ శ్రేణులు పంపిణీ చేస్తున్న కరపత్రాలను జనం పట్టించుకోవడంలేదు.

జగన్‌పై పట్టుసడలని విశ్వాసం

హామీలను సంపూర్ణంగా అమలు చేసిన జగన్‌పై ప్రజల్లో విశ్వాసం నేటికీ బలంగా ఉంది. ఇచ్చిన హామీలను ఎలాగైనా అమలు చేయాలనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం.. అధికారం కోసం ఎంతటికైనా తెగించే చంద్రబాబు తత్వాన్ని ప్రజలు గమనించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టి.. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు మేమంతా సిద్ధం అని ప్రజలు ఫిక్సయ్యారు.

చంద్రబాబు హామీలను ప్రజలు నమ్మరు



2014 ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు దేన్నీ సక్రమంగా అమలు చేయలేదు. ఫలితంగా ప్రజలు మోసపోయారు. ఇప్పుడు కొత్త హామీలతో ముందుకొస్తున్న ఆయన్ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు.

– అశోక్, విశ్రాంత ఉపాధ్యాయుడు, ఉదయగిరి

నమ్మకం కోల్పోయిన బాబు



హామీలను అమలు చేయని చంద్రబాబుకు 2019 ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పరిపూర్ణంగా అమలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ముందుకెళ్లి ఓటును అడగగలుగుతున్నారు. చంద్రబాబుపై ప్రజలకు నమ్మకం లేదు.

– బాషా, గండిపాళెం, ఉదయగిరి

సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న హరినారాయణన్

కావలి: ఎన్నికల ప్రక్రియలో సెక్టోరల్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని, పోలింగ్ ముగిసేంత వరకు తమ విధులను సమర్థంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. ఎన్నికలపై కావలి, కందుకూరు సెక్టోరల్ అధికారులకు కావలి ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. శిక్షణలో తెలియజేసిన అంశాలను ఆకళింపు చేసుకొని ఎలాంటి పొరపాట్లు లేకుండా పోలింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. పోలింగ్‌ను మే 13న నిర్వహించనున్న తరుణంలో సెక్టోరల్ అధికారులు తమ విధులను అప్రమత్తంగా నిర్వర్తించాలని కోరారు. తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వివరాలు, రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసుకోవాలన్నారు. ఈవీఎంల మేనేజ్‌మెంట్‌పై పూర్తి స్థాయి అవగాహన అవసరమని సూచించారు. డోర్ టు డోర్ ఓటరు స్లిప్పులను బూత్ లెవల్ అధికారుల ద్వారా అందించే బాధ్యత సెక్టోరల్ అధికారులపై ఉందని పేర్కొన్నారు. పోలింగ్‌కు 48 గంటల ముందు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ప్రిసైడింగ్ అధికారులు, సిబ్బందికి అప్పగించే ఈవీఎంలు తదితరాలపై పూర్తి బాధ్యత వహించాలని కోరారు. సెక్టోరల్.. పోలీస్.. ప్రిసైడింగ్ అధికారులకు ఏ చిన్న సమస్య ఏర్పడినా ఎప్పటికప్పుడు రిటర్నింగ్ అధికారులకు తెలిపి తగిన పరిష్కారం పొందాలని చెప్పారు. అందరూ సమన్వయంతో పనిచేసి జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేలా తమ వంతు కృషి చేయాలని కోరారు. కావలి, కందుకూరు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు శీనానాయక్, విద్యాధరి, కమిషనర్ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మనుక్రాంత్‌రెడ్డిని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాం



మనుక్రాంత్‌రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి, చిత్రంలో బీద మస్తాన్‌రావు, ఆదాల, ఖలీల్ అహ్మద్, చంద్రశేఖర్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీలో సముచిత స్థానాన్ని కల్పిస్తాం
- పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జనసేన జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్‌రెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నామని పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. మినీబైపాస్ రోడ్డులోని దమ్మై ఫర్నిచర్ మాల్ వెనుక వీధిలో గల మనుక్రాంత్‌రెడ్డి నివాసంలో ఆయన్ను విజయసాయిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, పార్టీ నెల్లూరు రూరల్, సిటీ అభ్యర్థులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఖలీల్ అహ్మద్ బుధవారం కలిశారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడారు. మనుక్రాంత్‌రెడ్డిని తమ పార్టీలోకి ఆహ్వానించగా, ఆయన అంగీకరించారని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరనున్నారని వెల్లడించారు. ఆయన హోదా, అనుభవానికి తగిన విధంగా పార్టీలో సముచిత స్థానాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ అధికారంలోకి వచ్చాక మనుక్రాంత్‌రెడ్డి రాజకీయ భవితవ్యంపై మంచి నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రజాజీవితంలో ఆరేళ్లుగా ఉన్నారని, ఆయన చేరికతో పార్టీ మరింత బలోపేతమవుతుందని చెప్పారు.

కొద్ది మందికే ఈ గౌరవం దక్కుతుంది

తనను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి పార్టీ పెద్దలు ఆహ్వానించారని, ఈ గౌరవం కొద్ది మందికే దక్కుతుందని మనుక్రాంత్‌రెడ్డి చెప్పారు. జనసేన కోసం ఆరేళ్లుగా పనిచేస్తున్నానని, తాను ఏ నిర్ణయం తీసుకున్నా అందరూ అండగా ఉంటారని భావిస్తున్నానని తెలిపారు. తనతో పాటు పార్టీలో పలువురు చేరనున్నారన్నారు. గత ఎన్నికల్లో జనసేన తరఫున పోటీ చేసిన తనకు ఈసారి అవకాశం లభించకపోవడం కొంత బాధ కలిగించిందని, పార్టీని వీడేందుకు ఇదీ ఓ కారణమని చెప్పారు.

టీబీ, లెప్రసీకి మెరుగైన చికిత్స

- జిల్లా టీబీ కంట్రోల్ అధికారి ఖాదర్‌వలీ

ఆత్మకూరు: వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని.. టీబీ, లెప్రసీ వ్యాధులకు ప్రభుత్వాస్పత్రుల్లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా నాణ్యమైన వైద్యం, మందులు అందుబాటులో ఉన్నాయని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కంట్రోల్ అధికారి ఖాదర్‌వలీ పేర్కొన్నారు. ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని ఆకస్మికంగా బుధవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ల్యాబ్‌లను సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నంతో కలిసి పరిశీలించారు. అనంతరం డాక్టర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో టీబీ యూనిట్లు ఉన్న ఆస్పత్రుల నుంచి పరీక్షల నివేదికలను జిల్లా అధికారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. ల్యాబ్ టెక్నీషియన్లకు పలు సూచనలు చేశారు. అనంతరం టీబీ యూనిట్, డీఎంసీని, ఐసీటీసీ సెంటర్లను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ ఉషా సుందరి, వివిధ విభాగాల డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రి ఐసీటీసీ సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఖాదర్‌వలీ

కనిపించిన నెలవంక



బారాషహీద్ దర్గా సమీపంలోని ఈద్గాలో విస్తృత ఏర్పాట్లు

- వెల్లివిరిసిన ఆనందోత్సాహాలు
- ప్రత్యేక దువాతో ఉపవాస దీక్షల విరమణ
- ఈద్ – ఉల్ – ఫిత్ర్ నేడు
- ప్రార్థనలకు ఈద్గాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

నెల్లూరు(బృందావనం): వినీలాకాశంలో నెలవంక బుధవారం కనిపించింది. మతపెద్దల ప్రకటనతో ఈద్ – ఉల్ – ఫిత్ర్‌ను ఆనందోత్సాహాలతో గురువారం జరుపుకొనేందుకు ముస్లింలు సన్నద్ధమయ్యారు. నెల రోజుల ఉపవాస దీక్షలను ప్రత్యేక ప్రార్థనలతో విరమించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో బాణసంచాను కాల్చి.. మిఠాయిలను పంచుకొని.. ఆత్మీయ ఆలింగనాలతో శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

నగరంలో సందడి

ఈద్ – ఉల్ – ఫిత్ర్ సందర్భంగా నగరంలో సందడి నెలకొంది. పండగకు అవసరమైన సామగ్రి, నూతన వస్త్రాలను కొనుగోలు చేసే వారితో నగరంలోని వివిధ ప్రాంతాల్లో కోలాహలం నెలకొంది. ప్రధాన కూడళ్లు, వీధులు రద్దీగా మారాయి.



సంబరాలు జరుపుకొంటున్న ముస్లింలు

ప్రార్థనలకు సర్వం సిద్ధం

వేలాది మంది ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా నగరంలోని బారాషహీద్ దర్గా ఈద్గా వద్ద ఏర్పాట్లు చేశారు. నవాబుపేట, రైలువీధి తదితర ప్రాంతాల్లోని ఈద్గాలను సుందరంగా ముస్తాబు చేశారు.

దళారీ.. అంతే మరి..!

- టీటీడీలో దర్శనాల పేరుతో వసూళ్లు
- వీఐపీ, వీవీఐపీలొస్తే వారి వెనుకే మకాం
- బ్రేక్ దర్శనాలివ్వకపోతే టీటీడీపై విమర్శలు
- తనకు మించిన మేధావి లేడంటూ తరచూ మీడియా డిబేట్లు
- నోటాతో పోటీపడలేని వ్యక్తి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానంటూ వసూళ్లు
- సదరు వ్యక్తిపై తిరుపతిలో వదంతుల షికార్లు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిలో పే..ద్ద రాజకీయ నేతనని చెప్పుకొనే ఓ వ్యక్తి దేవుడి దర్శనాల పేరుతో భారీగా డబ్బులు సంపాదించారు. ఢిల్లీ లేదా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వీఐపీ, వీవీఐపీల వెనుకే పాతుకుపోతారు. గతంలో జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగి నోటాకు వచ్చినన్ని ఓట్లు సైతం రాని ఆ దళారీ.. ఇప్పుడు ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానంటూ పలువురు వ్యాపారులు, పారిశ్రామికవేత్తల నుంచి భారీగా డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఓ ప్రముఖ రాజకీయ పార్టీ నేతనని చెప్పుకొనే సదరు గల్లీ నేత టీవీ డిబేట్లలో తరచూ దర్శనమిస్తుంటారు. ఒకప్పుడు చంద్రబాబును విమర్శించిన సదరు వ్యక్తి ఇప్పుడు అధికార పార్టీని టార్గెట్ చేసి విమర్శలు గుప్పిస్తున్నారు. టీటీడీపై ఏదో విధంగా దుష్ప్రచారం చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. దీనికి కారణం లేకపోలేదు. అతను ఎప్పుడు కోరితే అప్పుడు అడిగినన్ని బ్రేక్ దర్శనాలివ్వాలి. అలా కానిపక్షంలో టీటీడీపై లేనిపోని ఆరోపణలు చేయడం అలవాటుగా మార్చుకున్నారు. దీని కోసమే ఆయన్ను డిబేట్లకు ఎల్లో మీడియా పిలిచి.. మాట్లాడించి రాక్షసానందం పొందుతోంది.

పోటీ చేస్తున్నా.. విరాళమివ్వండి



'ఈ సార్వత్రిక ఎన్నికల్లో నేను పోటీ చేస్తున్నా.. సీటు ఖరారైంది.. ఎన్నికల ఖర్చు కోసం విరాళాలివ్వాలి' అని ఏపీతో పాటు, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన ప్రముఖ వ్యాపారులు, పారిశ్రామికవేత్తల నుంచి భారీగా వసూలు చేశారనే వార్త తిరుపతిలో రెండు రోజులుగా చక్కర్లు కొడుతోంది. ఓ వ్యాపారి వద్ద రూ.రెండు కోట్లు, చెన్నైకి చెందిన పారిశ్రామికవేత్త నుంచి రూ.మూడు కోట్లు, తిరుపతిలోని పలువురు వ్యాపారుల వద్ద రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు వసూలు చేశారనే ప్రచారం జరుగుతోంది. ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్ ఇవ్వలేదు కదా.. తీసుకున్న డబ్బును తిరిగివ్వండి ప్లీజ్ అని అడుగుతుంటే సదరు గల్లీ లీడరైన దళారీ తప్పించుకొని తిరుగుతున్నారని సమాచారం. ఫోన్ చేసినా తీయడంలేదనే టాక్ నడుస్తోంది.

ఈఓను మార్పించేస్తా..!

తను అడిగినప్పుడు బ్రేక్ దర్శనాలకు అనుమతివ్వడంలేదనే కక్షతో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈఓ ధర్మారెడ్డిపై కొంత కాలంగా ఆరోపణలు చేస్తున్నారు. తిరుపతి అభివృద్ధికి అడుగడుగునా అడ్డుపడుతూ.. లేనిపోని అంశాలపై దుష్ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. ఇంతటితో ఆగని సదరు దళారీ డబ్బులు గుంజుకోవడంతో పాటు.. తనకు అడ్డుపడుతున్న టీటీడీ ఈఓను బదిలీ చేయించే కుట్రలకు తెరలేపారు. దీనికి టీడీపీ, జనసేన నేతలను పావుగా వాడుకుంటున్నారు. ఈఓ ఉంటే ఎన్నికలకు ఇబ్బందవుతుందని వారిని నమ్మించే యత్నం చేశారు. ఈఓను మార్చాలంటే ఢిల్లీ వెళ్లాల్సి ఉంటుందని, భారీగా ఖర్చవుతుందని జనసేన అభ్యర్థిపై ఒత్తిడి తెస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

నాడు మౌనం

బోర్డు సభ్యుడిగా ఉన్న రెండేళ్లలో తిరుమలలో భక్తుల సదుపాయాలు, అభివృద్ధిపై ఏ రోజూ మాట్లాడలేదు. పోనీ తిరుపతిలో సదరు పార్టీ బలోపేతానికి పనిచేశారా అంటే అదీ లేదు. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో బాలసుబ్రహ్మణ్యం అనే ఐఏఎస్ అధికారి తొమ్మిదేళ్లకంటే ఎక్కువ కాలం తిరుమల జేఈఓగా కొనసాగారు. అప్పట్లో మూడు ఎన్నికలు జరిగాయి. ఆ సమయంలో ఎప్పుడూ ఈ అంశాన్ని ప్రశ్నించిన పాపాన పోలేదు. మరో ఐఏఎస్ అధికారి శ్రీనివాస రాజును నాటి సీఎంలు కిరణ్‌కుమార్‌రెడ్డి, చంద్రబాబు తొమ్మిదేళ్లకుపైగానే తిరుమల జేఈఓగా కొనసాగించారు. ఆ సమయంలో రెండుసార్లు శాసనసభ ఎన్నికలు జరిగినా అప్పుడూ నోరెత్తలేదు. అలాంటి దళారీ ఇప్పుడు టీటీడీ ఈఓపై బురదజల్లడంతో పాటు టీటీడీని బజారుకు లాగేందుకు యత్నిస్తున్నారు. టీటీడీలో పనిచేస్తున్న అధికారులు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనరు. ఈ తరుణంలో వారు ఎన్నికల బదిలీల పరిధిలోకిరారు. ఈ విషయం తెలిసినా ఈఓను బదిలీ చేయాలని మీడియాలో రగడ చేస్తూ చీప్ పబ్లిసిటీ పొందేందుకు యత్నిస్తుండటంపై టీటీడీ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏడాదికి 300 లేఖలా..?

తిరుమల శ్రీవారి దర్శనాలను అడ్డుపెట్టుకొని ప్రధాన రాజకీయ పార్టీకి చెందిన సదరు దళారీ ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగారు. గతంలో ఏడాదికి శ్రీవారి బ్రేక్ దర్శనాల కోసం 300 లేఖలు పెట్టారని విశ్వసనీయ సమాచారం. గతంలో ఈయన టీటీడీ బోర్డు సభ్యుడిగా వ్యవహరించారు. ఈ పదవిని అడ్డుపెట్టుకొని స్వామి దర్శనానికి పలుకుబడి గలవారు, సంపన్నులు వస్తే వారి వెంటే ఉండి దళారీగా పని చేయడాన్ని వృత్తిగా మార్చుకున్నారనే ప్రచారం ఉంది. టీటీడీ బోర్డు సభ్యుడిగా ఉన్న సమయంలో తిరుపతిలోని పార్టీ కార్యకర్తలు, నేతలకు ఒక్క దర్శన టికెట్‌ను సైతం ఇప్పించకుండా కోటా టికెట్లను స్టార్ హోటళ్లకు గంపగుత్తుగా అమ్మేసిన వైట్ కాలర్ దళారీగా మారారు. ఈ దళారీ వ్యాపారానికి టీటీడీ చెక్ పెట్టడంతో చైర్మన్, ఈఓపై కక్ష పెంచుకొని బ్లాక్ మెయిల్ చర్యలకు పాల్పడుతున్నారు.

క్లుప్తంగా

స్వేచ్ఛగా ఓటు వేయాలి

• ఓటరు సెల్ఫీ బూత్ ప్రారంభం



సెల్ఫీ బూత్‌లో కలెక్టర్

కావలి : ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ కోరారు. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో ఓటర్లను చైతన్య పరిచేందుకు ఏర్పాటు చేసిన సెల్ఫీ బూత్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ దృఢమైన ప్రజాస్వామ్యం కోసం తప్పనిసరిగా ఓటు వేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

పటిష్టంగా భద్రతా ఏర్పాట్లు



స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

నెల్లూరు(క్రైమ్) : స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ పోలీసు అధికారులను ఆదేశించారు. నెల్లూరు నగరంలోని కనుపర్తిపాడులో ఉన్న ప్రియదర్శిని కళాశాలలో స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ కేంద్రం భద్రత ఏర్పాట్లను ఎస్పీ బుధవారం స్వయంగా పరిశీలించారు. బారికేడ్లు, మూడంచెల భద్రత, సీసీ కెమెరాల ఏర్పాటు తదితరాలపై పోలీసు అధికారులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. స్ట్రాంగ్‌రూమ్‌కు ఈవీఎంల తరలింపు సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చూడాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఇతరశాఖల సమన్వయంతో కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసరావు, నెల్లూరు రూరల్ డీఎస్పీ పి.వీ రాంజనేయరెడ్డి తదితరులున్నారు.

ఎవరెస్ట్ బేస్‌క్యాంప్‌నకు జిల్లా వాసులు



ఎవరెస్ట్ బేస్‌క్యాంప్‌లో రామకృష్ణారెడ్డి మిత్రబృందం

నెల్లూరు(బృందావనం) : మర్రిపాడు మండలం భీమవరానికి చెందిన ప్రవాస భారతీయుడు మూలె రామకృష్ణారెడ్డి తన మిత్ర బృందంతో కలిసి ఎవరెస్ట్ బేస్‌క్యాంప్‌ను మంగళవారం చేరుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను ఆయన బుధవారం వెల్లడించారు. లండన్‌లో స్థిరపడిన తన మిత్రులతో కలిసి గత నెల 22న ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించేందుకు బయలుదేరామన్నారు. సుమారు 18,500 అడుగుల ఎత్తున మూడో బేస్‌క్యాంప్‌నకు మంగళవారం చేరుకున్నామన్నారు. దీని కోసం ఏడాది పాటు కఠోర శిక్షణ తీసుకుని యాత్ర సాగించామన్నారు.

విద్యుదాఘాతంతో విద్యార్థికి తీవ్రగాయాలు

ఉదయగిరి : మండలంలోని దుర్గంపల్లిలో విద్యుదాఘాతానికి గురై ఓ విద్యార్థికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం జరిగింది. వివరాలు.. దుర్గంపల్లికి చెందిన సింగనబోయిన చంద్రబాబు, సుజాత కుమారుడు సన్నీ పాఠశాలకు వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో టిఫిన్ చేస్తూ టీవీ చూసేందుకు స్విచ్ ఆన్ చేయబోతుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగిలింది. వెంటనే చెల్లెలు శ్రీనిధి చొక్కా కాలర్ పట్టుకుని సన్నీని రక్షించింది. ఈ ప్రమాదంలో సన్నీ ఎడమ చేతి వేలు విరగ్గా మిగిలిన వేళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

జనరంజక పాలనకు పట్టం కట్టండి

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ప్రచారంలో మాట్లాడుతున్న కాకాణి

మనుబోలు : అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రంలో జనరంజక పాలన సాగించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని కాగితాలపూరు, ఎల్ఎస్‌పురం, పిడూరు గ్రామాల్లో బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో 607 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వాటిలో ఆరు హామీలను కూడా అమలు చేయలేదన్నారు. రుణమాఫీ అని చెప్పి రకరకాల కొర్రీలు పెట్టి రైతులను, పొదుపు మహిళలను మోసం చేశాడన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో దాదాపుగా ప్రతి హామీని నెరవేర్చారన్నారు.

వలంటీర్లపై నాలుక మడతేసిన బాబు

నిన్న మొన్నటి వరకు వలంటీర్లను తిట్టిపోసిన చంద్రబాబు ఇప్పుడు ఓట్ల కోసం నాలుక మడతేసి తాను అధికారంలోకి వస్తే రూ.10 వేల జీతం ఇస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. వలంటీర్లు ఇళ్లకు వెళ్లి పింఛన్ ఇస్తే ఓట్లు పడవనే భయంతో చంద్రబాబు ఎన్నికల కమిషన్‌ను అడ్డుపెట్టుకుని నిలిపి వేయించాడన్నారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పింఛన్ కోసం వెళ్లి ఎంతో మంది వృద్ధులు విగతజీవులుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వస్తే ఎలా ఉంటుందో అనేదానికి ఇదే ఉదాహరణగా నిలుస్తుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. అంతకుముందు మాజీ సర్పంచ్ మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ తిక్కవరపు వెంకటరమణారెడ్డి, సర్పంచ్ ఏడుకొండలు, ఎంపీటీసీ గుమ్మడి వెంకట సుబ్బయ్య, ఉప్పలపాటి రామసుబ్బానాయుడు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు కాకాణికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ వజ్రమ్మ, నాయకులు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గుండాల ఆదినారాయణ, మన్నెమాల సుధీర్‌రెడ్డి, మారంరెడ్డి ప్రదీప్‌రెడ్డి, కసిరెడ్డి ధనుంజయరెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, జగదీష్, నవకోటి, దయాకర్, రమేష్, గిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మనిషి ప్రసన్న

• రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు



ర్యాలీలో ఎంపీ బీద మస్తాన్‌రావు, ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వైఎస్సార్‌సీపీ కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రజల మనిషి అని ఎంపీ బీద మస్తాన్‌రావు అన్నారు. మండలంలోని జొన్నవాడలో ప్రసన్నతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తొలుత కామాక్షితాయి ఆలయం నుంచి భారీ జనసందోహం మధ్య ర్యాలీగా బయలుదేరి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా మస్తాన్‌రావు మాట్లాడుతూ ఎప్పుడూ ప్రజల మధ్య ఉండే ప్రసన్నకుమార్‌రెడ్డిని ఎంపీ అభ్యర్థిగా విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. తద్వారా జిల్లా మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందన్నారు.

నాలుగైదు గేట్లు దాటుకెళ్లాలి

కోవూరు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇంటికి వెళ్లాలంటే నాలుగైదు గేట్లు, సెక్యూరిటీని దాటుకెళ్లాలని, ఇలాంటి వారు ప్రజలకు ఏమి సేవ చేస్తారని ప్రసన్న విమర్శించారు. దీనికి భిన్నంగా తన ఇంటికి వచ్చిన వారిని ప్రేమతో, సాదరంగా ఆహ్వానిస్తామన్నారు. ఈ విషయం కోవూరు ప్రజలకు తెలుసునన్నారు. వలంటీర్లను పనిచేయకుండా చేసిన చంద్రబాబు అధికారంలోకి వస్తే వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. వేమిరెడ్డి దంపతులు నాయకులను కొనగలరేమోగానీ, ప్రజలను కొనాలనుకుంటే తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. ఫిబ్రవరిలో తన తమ్ముడు రాజేంద్రకుమార్‌రెడ్డికి ప్రశాంతిరెడ్డి ఫోన్ చేసి రూ.కోట్ల ఆఫర్ చేసిందని, అందుకు తన తమ్ముడు తగిన బుద్ధి చెప్పారన్నారు. ఆమె ఫోన్ సంభాషణపై ఇప్పటివరకు సమాధానం ఇవ్వలేదన్నారు. అడిగిన దానికి సమాధానం ఇవ్వకుండా వారి ఇంట్లో పనిచేసే వారితో మాట్లాడించడం సరికాదన్నారు. జొన్నవాడలో అభివృద్ధి జరగలేదని చెప్పడం సరికాదని, రూ.3.20 కోట్లతో జొన్నవాడ నుంచి బుచ్చిరెడ్డిపాళెం వరకు వేసిన రోడ్డు కనిపించలేదా అని ప్రశ్నించారు. నెల్లూరు బైపాస్‌రోడ్డు వద్ద కనుపర్తిపాడు కాలువను ఆక్రమించి అక్రమంగా నిర్మించిన విల్లాలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కల్యాణ్ చక్రవర్తి, రాజేంద్రకుమార్‌రెడ్డి, రజత్ కుమార్‌రెడ్డి, మోర్ల సుప్రజ, పార్టీ మండల కన్వీనర్లు సతీష్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌కు అండగా నిలవాలి

• మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

మర్రిపాడు : అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ అండగా నిలవాలని నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. మర్రిపాడు మండలం చిలకపాడు, శెట్టిసముద్రం గ్రామాల్లో ప్రజలతో రచ్చబండ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో ముఖాముఖి మాట్లాడారు. ప్రతి ఇంటికి సంక్షేమాన్ని అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. వైఎస్సార్‌సీపీకి వెన్నుపోటు పొడిచిన ఆనం మీ ముందుకు వస్తున్నాడని, అధికారం కోసం పార్టీలు మారిన వ్యక్తులను నమ్మవద్దని సూచించారు. మన ప్రాంత అభివృద్ధిని విమర్శిస్తూ ఇక్కడి రైతుల పట్ల చులకనగా మాట్లాడిన వారు మీ గ్రామాలకు ఓటు కోసం వస్తే తగిన బుద్ధి చెప్పాలన్నారు. గడిచిన ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, అందుకోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. నెల్లూరు పార్లమెంట్ సభ్యునిగా విజయసాయిరెడ్డిని, ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని గెలిపిస్తే మన ప్రాంతం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని వివరించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సిద్ధం రెడ్డి మోహన్‌రెడ్డి, సోమల మాధవరెడ్డి, బొర్రా వెంకటేశ్వరరెడ్డి, చెన్ను శ్రీధర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, దుగ్గిరెడ్డి కృష్ణారెడ్డి, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ హజరత్ రెడ్డి, గంగినేని బాబు, కాశీరెడ్డి, ఒంకారం శివ, షేక్ మౌలాలి, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ల ఆకస్మిక తనిఖీ

నెల్లూరు(క్రైమ్) : ఎన్నికల నేపథ్యంలో నగరంలోని వేదాయపాళెం, వెంకటాచల సత్రం, మనుబోలు పోలీస్‌స్టేషన్‌లను ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌ల పరిధులు, భౌగోళిక స్థితిగతులు, క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌లు, తాజా పరిస్థితులపై ఎస్పీ ఆరాతీశారు. సాధారణ, సమస్యాత్మక గ్రామాల్లో ముందస్తు సమాచారం సేకరించాలని, ట్రబుల్ మాంగర్స్‌ను బైండోవర్ చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రచారాల అనుమతులకు సంబంధించిన పత్రాలను స్టేషన్‌లో అందుబాటులో ఉంచాలని, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే వారు, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం వాటిల్లితే హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకునే విధంగా పోలీసు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్పెక్టర్‌లు రామకృష్ణారెడ్డి, నారాయణ, అంకమ్మ పాల్గొన్నారు.

ప్రజలే స్టార్ క్యాంపెయినర్లు

• ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



వృద్ధుడిని పలకరిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

అనుమసముద్రంపేట : వైఎస్సార్‌సీపీకి ప్రజలే స్టార్ క్యాంపెయినర్లు అని, ప్రతి ఒక్కరిని ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసేలా చేయాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కోరారు. ఏఎస్‌పేట మండలం జమ్మవరం, కాకర్లపాడు గ్రామాల్లో ఆయన బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జమ్మవరం పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులకు రూ.1.20 కోట్ల నిధులను ఖర్చు చేశామని, అదేవిధంగా డీబీటీ, నాన్ డీబీటీల రూపంలో రూ.13.88 కోట్ల నిధులు ప్రజలకు అందజేశారన్నారు. 38 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందినట్లు తెలియజేశారు. 60 మంది రైతులకు సంబంధించి 182 ఎకరాల చుక్కల భూముల సమస్యను పరిష్కరించామన్నారు. గత ప్రభుత్వ హయాంలో కనీసం పది శాతం కూడా అభివృద్ధికి నిధులు మంజూరు కాలేదని గుర్తుచేశారు. అయితే ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ లాంటి శాశ్వత భవనాల ఏర్పాటుతో గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండేలా జగనన్న చేశారన్నారు. ప్రజలకు మేలు చేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పందిళ్లపల్లి సుబ్బారెడ్డి, ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వరమ్మ, జేసీఎస్ కన్వీనర్ పులిమి రమేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరమణయ్య, సిరిగిరి వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

• వైఎస్సార్‌సీపీ ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

కొండాపురం : కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, ఈ ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొమ్మి, రామానుజపురం, కుంకువారిపాళెం గ్రామాల్లో ఆయన బుధవారం విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. తొలుత వైఎస్సార్‌సీపీ నేతలు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో జనరంజక పాలన అందించారని తెలిపారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. అదేవిధంగా నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వైద్యశాలల రూపురేఖలు మార్చినట్లు తెలిపారు. పేద కుటుంబాలకు కార్పొరేట్ విద్య, వైద్యం చేరువైందన్నారు. పేదల సంక్షేమాన్ని టీడీపీ జీర్ణించుకోలేక అడ్డగోలు విమర్శలు చేస్తోందన్నారు. టీడీపీ అబద్ధపు హామీలు, కుట్రలతో ముందుకు వస్తోందని.. ప్రజలు గమనించి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో మరోసారి టీడీపీకి బుద్ధి చెప్పాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే తనను ఎమ్మెల్యేగా, విజయసాయిరెడ్డిని ఎంపీగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు చిమ్మిలి రవీంద్ర, గుడవళ్లూరు సొసైటీ అధ్యక్షుడు కర్తం శ్రీనివాసులురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ యారం నరసింహారావు, సర్పంచ్ అంకమ్మ, ఎంపీటీసీ రాజేశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు ఎ.వెంకటరమణయ్య, ఎం.వెంకటసుబ్బయ్య, ఎ.మాల్యాద్రి, పి.సునంద, బీ.ఆదామ్, బి.మాలకొండయ్య, పి.కమలాకర్, కె.మాదవరావు, షేక్ నజీర్, ఏడుకొండలు, వి.మాదవయ్య, పిన్నిక కొండయ్య పాల్గొన్నారు.

పోలింగ్ ఏజెంట్లను నియమించుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట) : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు పోలింగ్ ఏజెంట్లను పూర్తిస్థాయిలో నియమించుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో కొత్త ఓటర్ల నమోదుకు 14వ తేదీ వరకు దరఖాస్తులు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం జిల్లాలో 20,48,252 మంది ఓటర్ల జాబితాలో ఉన్నారన్నారు. ఇప్పటి వరకు వచ్చిన అన్నిరకాల దరఖాస్తులు పరిష్కరించగా, 7,932 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిని వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెల 12వ తేదీ ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి విడత ర్యాండమైజేషన్ చేస్తామన్నారు. మధ్యాహ్నం ఈవీఎం గోడౌన్‌లను ఓపెన్ చేస్తామన్నారు. 18వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో లవన్న, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.70
సన్నవి : రూ.55
పండ్లు : రూ.24

ఈ ప్రభుత్వంలోనే అన్నివర్గాలకు మేలు



గ్రామంలో పర్యటిస్తున్న సునందారెడ్డి, నేహారెడ్డి

కోవూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్నివర్గాల ప్రజలకు మేలు జరిగిందని ఆ పార్టీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి సతీమణి సునందారెడ్డి అన్నారు. మండలంలోని గుమ్మళ్లదిబ్బలో ఆమె స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నెల్లూరు అభివృద్ధికి ప్రత్యేకంగా రూపొందించిన మేనిఫెస్టోను ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త విజయసాయిరెడ్డి నెల్లూరు బిడ్డ అని, ఇక్కడే విద్యాభ్యాసం చేశారన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తారని చెప్పారు. నెల్లూరుకు అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయం, ఐటీ రంగ అభివృద్ధికి కృషి చేస్తారన్నారు. ఎమ్మెల్యేగా ప్రసన్నకుమార్‌రెడ్డిని, ఎంపీగా విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నేహారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో నేత కార్మికులు ఎక్కువగా ఉన్నారని, వారికి క్రమం తప్పకుండా నేతన్న నేస్తం అందడంతో సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత, కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గౌరీ, గుమ్మళ్లదిబ్బ ఎంపీటీసీ సుప్రజ, తదితరులు పాల్గొన్నారు.